# "భోగం మేళం"

**"జగం."**

ముందు మాట:—సినీమా పరిశ్రమ పరుగులు పెట్టక ముందు సాని భోగం కులస్థులు—కనులుతెఱచిపాడు వృత్తి విసర్జించేందుకు సంఘాలు నిర్మించుకున్నారు. ఆంధ్రదేశం లోని అనేక ప్రదేశాలలో వున్నవాళ్లు వభ్యిచారవృత్తినించి విముఖత కనబఱచి—ముద్దు బిడ్డలకు పెళ్ళిళ్ళు చేశారు. ఇంతలోనే దాపురించింది సినీమా పిచ్చి. ఆశ—దురాశ పుట్టింది. ఏదో మంచి వుద్యమం లేవగానే దానికి యిటువంటి విఘాతాలు దాపురిస్తూనే వుంటవి. (సినీమా కళమీదద్వేషంతో కాదు.) ఏదో బావుకుందామవి— గుడివాడ ప్రాంతంలో భోగంవాళ్ళూ. మండపేటలో సానివాళ్లూ, కులవృత్తి యంటూ ఏమీ తెలీని పిల్లలను బలి యిస్తోన్నారు. యిలా బలియైన ఒక సోదరీమణి అవస్థజూచి. మేళాలు—దానివల్ల కలిగే ఫలితాలూ—చిత్రిగుప్త ద్వారా తెలియజేసి—మేలు కొల్పాలనే భావంతో కలం పట్టా. సాని భోగం కులస్థులు యికనింకైనా మేళాలు మానివేసి—అవస్థలనించి తప్పుకుంటారని ఆశ. ॥"జగం."॥

* * *

కిరసనాయిల్ కొట్టులో కూర్చుని—మా మామతో ఆమాటా యీమాటా మాటాడుతూన్నా, సాయంత్రం ఐదుగంట లౌతుంది. కాలవనించి వచ్చే చల్లగాలికోసం రోజూ అక్కడకు పోవడం మామూలు. మాటమీద మాట పెరిగి వాదానికి దారితీసింది. ఔనంటే కాదనటం, కాదంటే ఔననటం మా యిద్దఱికీ మామూలు. మొన్నటి రోజునకూడా అలానే వాగ్వాదం జరుగుతూంది. అంతలోనే రామూవచ్చి 'రాత్రికి మేళంవుంది చూచేందుకు వెళ్దామన్నా'డు. మావూళ్ళో కి వచ్చిన మేళం ఎప్పుడూ అవస్థపాలవకుండా పోలేదు. అదీ ఎలా తెలుసునంటే భోగం మేళం వున్నదంటే ఆ చుట్టువక్కలకుకూడా ఎప్పుడూ పోలేదు. ఆదో విధమైన కష్టంగా వుండేది. ఒకరోజున సినీమా చూచి వస్తోంటే దారిలో తగిలింది మేళం. స్నేహితులు—అందులో భోగం కుఱ్ఱవాళ్ళు—చదువుకున్నా వాళ్లూ మాకులేనికష్టం నీ కెందుకని ముందుకు తీసుకువెళ్ళేరు. తీరా చూద్దునుకదా పెద్దగుంపు, ఆ గుంపులోబడి నలిగిపోతున్నారు స్త్రీలు, ఆలా నలిపివేశేవాళ్ళు ఎవళ్ళానని చూస్తే—జ్ఞానులు, మహాజ్ఞానులున్నూ! వస్తువులు పోతయ్యనే భయంతో గజగజలాడిపోతూ పైటలు మెడలకు చుట్టుకున్నారు. ఆనాట్యకత్తెలు వాళ్ళ అవస్థ చూచేసరికి కళ్ళు తిరిగిపోయేయి. పాపం! వాళ్ళంతా ప్రక్కసందులోకి పారిపొయ్యారు. పెళ్ళివాళ్లు గర్జించేరు-వస్తారా రారానని. ఆరోజునించీ మేళం పేరుజెప్పితే ఛాలు,—ఆ దృశ్యం కళ్ళ ముందు ప్రత్యక్షమయ్యేది. వాళ్ళ కులస్థులు ఏమన్నా అడుకున్నారా అంటే అదీ శూన్యం. పోనీ ఆడుకోకపోతే పోయారు—అల్లరి చేయడం మానేరా అంటే అదీలేదు. మంచి ఖ్యాతి సంపాదించిన వూరు ఆఖరకు యింత ఘోరకలికి పాల్పడుతూందంటే చుట్టు ప్రక్కలవాళ్లకు ఎంత నీచం? ఈవూరుపేరు చెబితేనే గుడివాడ ప్రాంతంలోనివాళ్లు మేళం రావడానికి జంకుతారు. మానివేశారు కూడాను. అటువంటిది యిప్పుడు ఎలా వచ్చారాఅని ఆశ్చర్యంతో ప్రశ్నించా. ఏమో! మనకు తెలిసినవాళ్ళున్నారు. గొడవ జరుగుతూందేమోనని వాళ్ళ భయం అన్నాడు. మేం రామని చెపుతూండగా మామామ—'వెళ్దాం. ఏం జరుగుతుందో చూద్దామ'ని అన్నాడు. 'ఎందుకు మామా! వాళ్ళు నానాబాధలు పడుతూంటే చూడలేం పోనిద్దూ' అన్నా. అలాకాదు తప్పకుండా వెళ్ళాలన్నాడు. సరే చూద్దాంలే అన్నా. రామ మోహనరావు—తప్పకుండా రావాలని మరీ మరీ చెప్పి వెళ్ళిపోయేడు.

* * *

కడుపుమంటతో మలమల మాడిపోతూ దమ్మిడీ యాచిస్తే యివ్వనివాళ్ళు పెళ్ళిళ్ల పేరుచెప్పి వృధాగా వేలకువేలు ఖర్చు చేస్తారు. యిది తలుచుకుంటే ఏడుపొస్తూంది- వందలకొలదీ మందుగుండుకోసం కాల్చేస్తారు. ఎవ్వళ్లు తిన్నట్టూ ఎవళ్ళు మెచ్చినట్టు? ఎందుకు వచ్చిందీ పాడు అలవాటు? అంతడబ్బు ఖర్చుపెట్టే బదులు వో పాతికమంది పేదవాళ్ళకు సంతృప్తిగా భోజనం పెట్టితే ఎంత సంతోషిస్తారు; పెళ్ళి శుభకార్యం. అటువంటి శుభకార్యంలో దెబ్బలు తగిలి ఏడిచే ఏడ్పులు ఏమంత శ్రేయస్కరం? భోగం మేళం ఎందుకు? శుభంకోసం కదూ! యిప్పటి మేళాలన్నీ—ఏం పాడుతున్నారు? పాడించేవాళ్ళు ఏవి పాడిస్తూన్నారు. ఒక్కళ్ళు—తెలిసినవాళ్ళు వస్తూన్నారా? పెరుగు పాటలా? పచ్చి బూతులు. రామ! రామ!! ఈ పబ్లిక్ దురాగతానికి ఏపెద్దా అడ్డు పెట్టడే! ఏమీ జవాబివ్వడే! యిలా నడిరోడ్డుమీద జరిగేదానికి

తప్పులేదు కామోసు! యిదంతా శుభాన్ని గోరేదే!! పండితోత్తములు గర్హించేదే? మానవజాతి జ్ఞానం యిలా తగులబడిపోతూంది. లేకుంటే తమలాంటి మానవులనే ఎదుట నిలువబెట్టుకొని కారుకూతలు కూయిస్తూ—తైతెక్క లాడిస్తూ—అవమానిస్తూ ఆనందిస్తారూ? పశుపక్షులలో కూడా యిటువంటి దురాగతం లేదే. అవి తమ జాతిని గౌరవిస్తవే. వాటికి జ్ఞానం లేదంటాం కాని—అది పొరబాటు. మోసం! అంతా మోసం! మహాత్ములు—దేవార్చనకు—సపర్యకంటూ మోసగించి విడదీసి, ఎఱ్ఱగా కాల్చిన "ముద్రలు" వేసి—దైవ సంప్రీతికంటూ—తెలివిలేని ప్రజల నెత్తు మెక్కి—మత్తుబట్టి—వీళ్ళతో భోగించేరు. తరతరాలవాళ్ళూ తమ్ము మఱచిపోకుండేందుకు ముందు తమవాళ్ళు ముచ్చట చెల్లేందుకు సాని—భోగం జాతుల్నిసృజించేరు. ధన్యులు! యీతర హోమహాత్ములు ధన్యులు!!. రానురాను దేవదాసీలు స్వజాతి (మానవజాతి) తుచ్ఛ కోర్కె తీర్చే తోలుబొమ్మ లయ్యేరు. కళ పేరుతో కడుపు నింపుకోవలసిన వాళ్లయ్యేరు. తైతెక్కలాడ సిద్ధపడ్డారు, మొదటి రోజులలో గౌరవంగా బ్రతికేవాళ్ళు. అంతకంతకూ పుక్కిడి ఆటతో బూతు పాటలతో సిద్ధమయ్యేరు. లోకువ! ప్రతి మానవుని కంటికికూడా లోకువ! జాతి పేరుచెపితే పురుషులకు నౌఖరీ సున్నా. ఎవరన్నా విద్యావంతులైతే జాతి తక్కువ. గౌరవించకూడదు. వీడికీ విద్య అగ్రజాతి సంపర్కంవల్లే అలవడిందని ఆ కాస్త గౌరవం కాపాడుకోవడం? యిటువంటి మానవజాతి పశుజాతికన్నా జ్ఞానవంత మయ్యిందే! ఇక సాని—భోగంజాతులు వీళ్ళ కాళ్ళక్రింద బడి నలుగవలసిందే. వాళ్ళకు ముక్తిలేదు. మోక్షంలేదు.—ఈ సాని—భోగంవాళ్లకు సిగ్గూలేదు. ఎగ్గూలేదు. మేమూ మీలాంటి మానవులమే—మాకు ఎందుకు గౌరవంగా బ్రదికే హక్కులేదూ అని అడిగేందుకు జ్ఞానమూలేదు. ఎక్కడో ఆగాధంలో—మూర్గత్వమనే చీకటిలో పచివున్నారు. వాళ్ళకు జ్ఞానమనే వెలుగు తగులుతూన్నా దానికి అడ్డయ్యే మహాహాశయులు అణగారి పోందే!

* * *

రాత్రి తొమ్మిది దాటింది. రామూ, నేనూ, మా మామా మరి కొంతమందీ కలసి బజారులోకి బైలుదేరాం. ధణీల్‌మంది ఔటు. చిన్న చిన్న రవ్వల్ని రాలుస్తూ ఆకాశానికి పరుగెత్తింది గుండ్రటి గుండు. "ధుం" అంది మధ్యలో. జిగ—జిగ మెరిసేయి డాకు రేకు ముక్కలు. టప—టపలాడేయి మందువత్తులు. దూరాన గొల్లుమంటున్నారు చూడ్డానికి వచ్చినవాళ్లు. బ్యాండ్ మేళంవాళ్ళు—"నిన్న రమ్మన్నాదీ—నన్ను రమ్మన్నాది—యిద్దఱిని రమ్మని నిద్దరపోయిందీ" అని పాడుతోన్నారు. నౌబత్‌కానా, నామకః బండిలో వుంది. పెట్రొమాక్స్ లైట్లు కొన్ని రోడ్డుమీద దింపుకున్నారు లంబాడీలు, వాళ్ళను నానా మాటలాడుతోన్నాడు ఓ పెళ్ళివాళ్ళ మనిషి, రమ్మడోళ్ళవాళ్ళు ఒక్కసారిగా చెవులు మూసుకునేట్టు వాయించి విరమించేరు. హవ్వాయీలు కాలుస్తూన్నాడు తప్పతాగిన తాగుబోతు. "సునో—సునో" నొక్కులతో వత్తుతోన్నారు సొన్నాయి పాటకులు. యింతవరకూ పలచ పలచగానే వుంది బజారు. ముందుకు పోయాం. మూడువందలమంది మహాశయులు గుమిగూడేరు. పోలీసువాళ్ళు వొళ్ళు తెలియని స్థితిలో నిలబడ్డారు. "బం"—"బం" అంటూంది మద్దెల. కుయ్యి—కుయ్యి లాడుతోంది హార్మోనియం; అపశృతితో బరబరలాడుతోన్నాయి ఘడేళ్ళు. టక్కు టక్కుమంటూంది నాయకురాలి చేతిలోని తాళం.—

'పెరుగు పెరుగో యంటు—తిరిగి తిరిగొచ్చేవు'

అంటూ పాడుతోన్నారు. భోగం సానులు. రాళ్లు వచ్చి పడ్డాయి వరసగా. వెనక్కి తిరిగిచూచాను. ఆయన పెద్దమనిషి!? పౌరుషం! మహా పౌరుషం—పాట చరణం పూర్తికానేలేదు. త్రోపులాట .ప్రారంభమయ్యింది—యిక్కడ జరిగినది వర్ణించాలి. అలా వర్ణిస్తే కొంత బుద్ధయినా వస్తుందేమో. కొంచెం తప్పుగా వుంటుందని మానితే—ఇంతా వ్రాసింది వృధా. ఒకవేళ వ్రాసినా—సంపాదకులు అందుకు వప్పుకోరటారనే ధైర్యం వున్నా—కొంత అనుమానం కలుగుతూంది. ఏమో వారి యిష్టం. వ్రాస్తాను.

పెద్దమనిషి ఒకామెపైనపడి గట్టిగా కౌగలించుకొన్నాడు. యింకొక ఘనుడు పైట పట్టుకొని లాగివేశేడు. మరొకరు వక్షస్థలంమీద——చేయి వణకుతూవుంది—ఈ మహానుభావుల—అంతా—తలుచుకుంటూంటే కడుపు పగిలిపోతోంది. అప్పుడు అప్పుడు ఆ అభాగినుల ఆర్తనాదం; అలించే మానవులు లేరు. నవ్వులు—ఆ ఘనకార్యాలకు—నవ్వులు—ఆ నాట్యకత్తెల హృదయాలకు చిల్లులు—గడగడవణికిపోసాగేరు. పూర్తిగా ఎవరి చేతికి ఏది అందితే అది పట్టుకొన్నారు. చేతులెత్తి మ్రొక్కుతూన్నా ఆ మహాత్ములకు ఆనందకరంగా కనుపించింది వాళ్ళ జాలి పలుకులు వీళ్ళ చెవుల ములుకులు—ఊ, కానివ్వండి చూస్తారేమన్నారు. ఒళ్లుతెలీకుండా నిలచిన ముగ్గురు పోలీసు వాళ్ళు మామూలు ఏదో చెపితేకాని ఏమీ చేయమన్నారు. సందడిలో సడేమియా" గా వస్తువుల మీదికి చేతులు పడ్డాయి. హడిలి బెదిఱి కొట్లు అరుగులు ఎక్కేరు సానులు. కులుకు చూపులు—ఆ టక్కులు—పాపం! యివన్నీ మరచిపోయారు కాబోలు! అంత సిగ్గెందుకూ? కావలసింది డబ్బు. డబు

డబ్బిచ్చేరుకదూ! యింకా సిగ్గెందుకూ? యిలా అన్నానని కోపగించు తారేమో? సిగ్గు కావలసి వస్తే దానికి తగ్గట్టుగానే బుద్ధితెచ్చుకొని నడవాలి. వచ్చినప్పుడు అనుభవించాలి. ఆ మురుపు యిప్పుడే మవుతూంది? ఆ కులుకు ఏమీ సాయం చెయ్యలేదూ?—అరగంట ఆగిపోయింది వూరేగింపు. ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ వాళ్ళమీద పడసాగేరు. ఫిడలిష్టు పిరికిపడి మొఱ్ఱపెట్టసాగేడు. భోగం సానులు బుద్ధివచ్చింది బాబూ! మేం ఎరక్కపోయి వచ్చేం. మమ్మల్ని పోనిమ్మని బ్రతిమలాడేరు. నాయకురాలు నమస్కరిస్తూంటే చూడ వచ్చిన నాయకులంతా నవ్వుతూ మరీఅల్లరి మొదలుపెట్టేరు. ఒకో్క సుందరికీ కళ్ళనీళ్ళు తిరిగేయి. పది సంవత్సరాలుకూడా నిండని పసిపిల్ల బావురుమంది. హరి! హరీ!! ఏం పుట్టి మునిగిందో ఆ బాలికనుకూడా బలిపశువు క్రింద తయారు చేస్తోన్నారు. చూచిన కొద్దీ ఒకవేపున కోపం—మరోవేపున జాలీ—పుట్టేయి. మూడువందలమంది పదిమంది మేళమువాళ్ళను మధ్య నలిపివేసి మగతనం చూపిస్తూంటే చూడవచ్చిన ఆడవాళ్లు పారిపోయేరు, నడిబజారులో అవమానం—ఆంధ్రులు—స్త్రీలను అవమానం చేస్తోంటే దాన్ని అడ్డే శాసనం లేకపోయింది. యిది సాని భోగంవాళ్ళకు మాత్రమే. అదే మరేతెగ స్త్రీయైనానా చట్టం వర్తిస్తూంది.రక్షిస్తూంది. చూడలేక పోలీసువాళ్లతో వాళ్ళను యింటికి పంపించివేయండి అని కోరేం. మీ కెందుకూరుకోండన్నారు. పెళ్లివాళ్లు పోట్లాడుతోంటే-మీ అడ్వాన్సు యిచ్చేస్తాం మమ్మల్ని పోనివ్వండి అనిప్రార్థిస్తే అలా వీలులేదని చేయిపట్టుకు లాగేరు. మళ్లా బైలుదేరింది వూరేగుంపు, మందుసామాను కాలుస్తూనే వున్నారు. పచ్చబొట్టు పాట మొదలుపెట్టేరు. పొడుస్తూన్నా చూడమంటూ పక్కల్లో పొడిచేరు. ఆ పోట్లతో ప్రక్క సందులోకి పారిపోయి ఒకళ్ళ యింట్లో దాగున్నారు. గంటవరకూ ఒకళ్లూ యింటి ముందునించి కదలకపోవడమే గాక తలుపులు బద్దలుకొట్టేంత పనికూడా చేసేరు. భోగం మేళం! భోగం మేళం! అంటూ గొల్లుమన్నారు. వాళ్లు తిట్టే తిట్లు వింటే గుండె పగులుతూంది. వాళ్ళుచేసిన పనులుచూస్తే భారత స్త్రీ జాతికే తలవంపు లవుతూంది. యింతపెద్ద వూళ్లోనే యిలా జరిగిందికదా—యిదే పల్లెటూరయితే ఆస్త్రీల బ్రతుకు అంతతో సరియే అనుకోవాలి అని అనుకుంటూ యిళ్ళకు బైలుదేరుతోంటే యింటిలోకిపోక బైటనే వుండిపోయిన మద్దెల వాయించే అతను కనుపించేడు. పిలిచి తమ అవస్థ చెప్పుకొని ఈవూరువాళ్ళింత.... అంటూ లెంపలు వేసుకున్నాడు. కారు దిగీదిగడంతోనే గజ్జ కట్టించారనీ—కడుపు మాడుతోందనీ చెపుతోంటే ఎంతో కష్టమనిపించింది మనసుకి. అతన్ని ప్రశ్నించకుండా వుండలేకపోయా—అందఱూ మేళాలు మానివేస్తే మీరెందు కిలా వచ్చారన్నా. "కర్మ" అంటూనెత్తి కొట్టుకున్నాడు. ఈమధ్యనే అందులో ఒక పిల్లకి—13 ఏళ్ళుంటాయి, పెళ్లిసంబంధం తెచ్చి పెళ్లి చేయమంటే చేయమన్నారని చెప్పేడు. ఆ అమ్మాయిని చూస్తే హృదయం కుంగిపోతూంది. ఆ వయసులోనే వ్యభిచారం: సంవత్సరం పోగానే గ్రహచారం. నాయకురాలుతప్ప తక్కినవాళ్ళంతా18 ఏళ్ళ లోపు వాళ్ళే! చూపులకు ముసలిరికం దాపురిస్తోన్నట్టు కనుపిస్తోంది. ఈ గుడివాడ వాళ్ళకు—సినీమాలలో నటించి సంపాదించుదామనే ఆశతోనే యిలా చేస్తోన్నారు. తప్పు! యికనించైనా మేళాలవల్ల కలిగే గౌరవం జ్ఞాపకముంచుకొని మేళాలు మానివేయడమే మంచి పని. లేకుంటే అన్నివిధాలా అవమానం తప్పదు. వీళ్ళిలా చేయడం మిగతావాళ్ళకందఱికీ తలవంపులు తేవడమే. పెళ్ళిళ్ళుచేసే ధనవంతులుకూడా తాము చేస్తూన్న పని తప్పని గ్రహించి యికనించి మానివేయడం—భారతజాతి గౌరవాన్ని కాపాడేందుకు సాయం చేయడం మంచిది. ఛాందసులు ఒప్పన్నారని సాని మేళాలు భోగంమేళాలు పిలవడం వాళ్ళ నధోగతిలోనికి తోయడమే. ఏ చిక్కూ లేకుండా జరిగే వూరేగింపులకు భోగం మేళాలు పెట్టి, గొడవలు పెంచుకొని, వూరేగింపులు జరుగకుండా అవమానం పాలుకావడం మానుకోవాలి. నిష్కారణంగా తాము చెడ్డది కాక ఏమీ తెలీని పిల్లలను వృత్తికి దింపే సానిభోగం కులస్థులు మానవ జాతిలో తమ గౌరవాన్ని కాపాడుకొనేందుకు యికనించైనా పాటుపడి—చిన్నపిల్లల గోతిలోదింపి నాశనం చేయడం మానాలి, సంస్కర్తలూ—సంఘస్థులూ కళ్ళువిప్పి మళ్ళా ఆరంభించిన వ్యభిచార వృత్తిని నిర్మూలించేందుకు పనిచేయాలి. సంవత్సరానికొక సభ చేస్తామంటే—ఏదో ఫలితం కలిగిందని తలువడం వెఱ్ఱి. సాని భోగం కులస్థులంతా మేలుకోవాలి.

